క్లుప్తంగా

యోగా సాధన ఆరోగ్యానికి మేలు



పోచంపల్లి(జగ్గయ్యపేట): యోగా మాసోత్సవాలలో భాగంగా పోచంపల్లిలోని పాఠశాలలో సోమవారం పలు శాఖల ఉద్యోగులకు యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ట్రైనర్ అశ్విని మాట్లాడుతూ ఉద్యోగులు మానసిక ఒత్తిడిని జయించేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతిరోజు కొద్దిసేపు యోగా చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నందిగామరూరల్: ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడ అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఫార్మర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చలివేంద్రం వద్ద తాగునీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, ఆస్పత్రి చైర్మన్ నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రభాకర్



పెనుగంచిప్రోలు: ప్రోగ్రసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పీఆర్‌టీయూ) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా మండలంలోని సుబ్బాయిగూడెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మర్రి ప్రభాకర్ నియమితులయ్యారు. ఈసందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడతామన్నారు. ఈమేరకు తనను నియమించిన యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్టా కృష్ణయ్య, ఎఎమ్ గిరి ప్రసాద్‌రెడ్డి, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వాటర్ ఫిల్టర్ బహూకరణ



పెనుగంచిప్రోలు: స్థానిక మండల వనరుల కేంద్రానికి సోమవారం పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు ఆవుల రాంబాబు వాటర్ ఫిల్టర్‌ను బహూకరించారు. ఈ మేరకు ఫిల్టర్‌ను ఎంఈఓ డి.రవీంద్ర చేతుల మీదుగా అందజేశారు. ఉపాధ్యాయ యూనియన్ నాయకులు షేక్ నజీర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాడిరైతులకు దాణా పంపిణీ




గండేపల్లి(కంచికచర్ల) : మండలంలోని గండేపల్లి పశు వైద్యశాలలో ఎస్సీ రైతులకు సమీకృత దాణాను సోమవారం పంపిణీ చేశారు. పశు వైద్యాధికారి నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ రైతులకు 50శాతం రాయితీపై అందించే సమీకృత దాణాను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 50కేజీల దాణా బస్తాను సబ్సిడీపై రూ.555 అందించినట్లు వివరించారు. పశువులకు గురక వ్యాధి రాకుండా వ్యాక్సిన్ చేశారు. గాలికుంటు వ్యాధులు, నట్టల నివారణకు అవసరమైన మందులు పశు వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో సర్పంచి బొక్కా రవికుమార్, సోడగిరి సతీష్, రైతులు పాల్గొన్నారు.

పీ4 సర్వేపై సమీక్ష

చిల్లకల్లు(జగ్గయ్యపేట): పీ4 సర్వేను సచివాలయ సిబ్బంది త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో నితిన్ ఆదేశించారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన పంచాయతీ, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో పీ4 సర్వేను పూర్తి చేయాలన్నారు. పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. తాగునీటి ట్యాంకులను సైతం ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలని సిబ్బందికి సూచించారు. ఏవో మాధవ శర్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీటీకి వినతిపత్రం



వీరులపాడు: భూయజమానితో సంబంధం లేకుండా అర్హత కలిగిన ప్రతి కౌలురైతుకు ప్రభుత్వం కౌలు గుర్తింపుకార్డులు అందించాలని కౌలురైతు సంఘం మండల కార్యదర్శి చాట్ల రవి పేర్కొన్నారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ నాగరాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవ సాగుదారు పేరు మీదనే ఈక్రాప్ నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పల్లి కంటి విల్సన్, కౌలురైతులు, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం.. విజయవంతం చేద్దాం

ఎమ్మెల్సీ అరుణకుమార్



వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్, మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామరూరల్: కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం తలపెట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమ విజయవంతానికి నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ కోరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ 26 అనుబంధ విభాగాల నియోజకవర్గ కన్వీనర్లతో సోమవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణ కుమార్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల సంస్థాగత నిర్మాణంలో అనుబంధ విభాగాలు ఎంతో కీలకమన్నారు. అనుబంధ విభాగాల కన్వీనర్లంతా పార్టీ అభివృద్ధి, రానున్న ఎన్నికలలో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేయాలన్నారు. కూటమి నేతలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలుచేయకపోగా, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, రెడ్‌బుక్ పేరుతో సృష్టిస్తున్న అరాచకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు సూచించారు. సమావేశంలో నియోజకవర్గ అనుబంధ విభాగాల నియోజకవర్గ కన్వీనర్లు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల అమలుకు డిమాండ్

నందిగామటౌన్: ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీ ఎలా ఉన్నా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రెడ్‌బుక్ హామీని మాత్రం తూచా తప్పకుండా అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నందిగామ మండల, పట్టణ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సోమవారం రాత్రి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని కోరారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటినుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. ముఖ్యంగా జర్నలిస్టులపై కూడా కేసులు పెడుతున్న చరిత్ర కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు.

పార్టీ అండగా ఉంటుంది...

వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అన్ని రకాలుగా పార్టీ అండగా ఉంటుందని అరుణకుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం మోపుతున్న అక్రమ కేసులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో పటిష్టమైన లీగల్ సెల్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

నాయకులు, కార్యకర్తలతోపాటు వారి కుటుంబాలకు కూడా మంచి జరిగేలా బీమా సదుపాయం కల్పించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు మహ్మద్ మస్తాన్, మంచాల చంద్రశేఖర్, జడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, మంగునూరు కొండారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, జిల్లా అధికార ప్రతినిధి నెలకుదిటి శివనాగేశ్వరరావు, నాయకులు పాములపాటి రమేష్, ముప్పల శ్రీను, షేక్ యాకుబ్‌అలీ, దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, తోట అంజారావు, వడ్డెల్లి శ్రీను, గాడిపర్తి రామకృష్ణ, నల్లమల్లి మురళి, రామిరెడ్డి సీతయ్య, కరి రవీంద్ర, వేల్పుల రాము, నాయుడు ఉదయలక్ష్మి, షేక్ ఫాతిమా పాల్గొన్నారు.

చందర్లపాడులో..

చందర్లపాడులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ అరుణకుమార్ సోమవారం నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వెలగపూడి వెంకటేశ్వరరావు, నల్లాని సాయి, శాఖమూరు వెంకట కుమారి, గుడేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నందిగామటౌన్: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్ మోహనరావు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో 'వెన్నుపోటు దినం' వాల్‌పోస్టర్‌ను సోమ వారం రాత్రి వారు ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

పీజీఆర్‌ఎస్‌కు 14 అర్జీలు



నందిగామటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)కు వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరిస్తామని ఆర్డీవో కె.బాలకృష్ణ తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరు తూ 14 అర్జీలు అందినట్లు తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఎనిమిది అర్జీలు, పోలీసుశాఖకు రెండు అర్జీలు ,పీఆర్, మున్సిపల్, నేషనల్ హైవేస్, పౌరసరఫరాల శాఖకు ఒక్కొక్క అర్జీ చొప్పున అందినట్లు వివరించారు. అర్జీలను ఆయాశాఖల అధికారులకు పంపించి, త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూస్తానని ఆర్డీవో తెలిపారు.

బాలికల కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో ఉన్న జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు హెచ్‌ఎం కె.హేమమాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు అడ్మిషన్లు ఇస్తున్నట్లు వివరించారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పచ్చిరొట్ట విత్తనాలు అందించాలని డిమాండ్



ఏలూరి శివాజీ

పెనుగంచిప్రోలు: ఖరీఫ్ సాగు నేపథ్యంలో రైతులకు ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలను అందించాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ఏలూరి శివాజీ సోమవారం డిమాండ్ చేశారు. జూన్ నెల వచ్చినా ప్రభుత్వం ఇప్పటివరకు రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందించలేక పోయిందన్నారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలన్నారు. విత్తనాలు బ్లాక్‌మార్కెట్‌కు తరలి పోకుండా అధికారులు నిరంతర నిఘా ఏర్పాటు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు వెలుగు చూస్తున్న తరుణంలో రైతుకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వ్యవసాయం పండుగలా సాగగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రైతు పండించిన ఏపంటకు గిట్టుబాటు ధర లేకుండా పోయిందని గుర్తుచేశారు. రైతు భరోసా కోసం రైతులు ఎదురు చూస్తున్నారని, త్వరితగతిన అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఖరీఫ్‌పై సాగుపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న లాంఫాం శాస్త్రవేత్త డాక్టర్ ప్రతిభశ్రీ

కంచికచర్ల : వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ఆధ్వర్యంలో సోమవారం కంచికచర్ల రైతుసేవా కేంద్రంలో ఖరీఫ్ సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖరీఫ్ సాగులో పాటించాల్సిన జాగ్రత్తలపై రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏ)లకు అవగాహన కల్పించారు. గుంటూరు ప్రాంతీయ పరిశోధన కేంద్రం(లాం)కార్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రతిభశ్రీ, డాక్టర్ మహీషా, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌లో తగిన మోతాదులో ఎరువులను వాడాలన్నారు. జీవన ఎరువులను వినియోగించాలని రైతులకు సూచించారు. పంట నమోదు ఆవశ్యకత, నేల సంరక్షణ, రాయితీతో అందుబాటులో ఉన్న వ్యవసాయ యంత్ర పరికరాలు, తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ పరికరాలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. నందిగామ డివిజన్ వ్యవసాయ సహాయకులు డాక్టర్ ఐకే శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బత్తుల వెంకట్రావు, ఉద్యానవనశాఖ అధికారి నీలిమ, మండల వ్యవసాయ అధికారి కె.విజయ కుమార్ పాల్గొన్నారు.

కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, కౌలురైతు సంఘ నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: అర్హత కలిగిన ప్రతి ఒక్క కౌలు రైతుకు గుర్తింపుకార్డులతోపాటు రుణాలు మంజూరు చేయాలని కౌలురైతు సంఘం జగ్గయ్యపేట మండల కార్యదర్శి దంతాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కౌలురైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కౌలురైతు సంఘం నాయకలు సోమవారం జగ్గయ్యపేట ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూయజమాని సంతకం తొలగించి గ్రామసభల ద్వారా కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు అందజేయాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలురైతులకు కూడా వర్తింపజేయాలని కోరారు. రైతులు, సాగుదారుల పంట రుణాలు రీషెడ్యూలు చేసి కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘ నాయకులు రావెళ్ల శేషు, వీవీ.రాంప్రసాద్, కోట కృష్ణ, కౌలురైతులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ పునఃప్రతిష్ట



శ్రీసీతారాముల శాంతి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, భక్తులు



పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శ్రీసీతారామస్వామి (పెద్ద రామాలయం)ఆలయ పునఃప్రతిష్టా మహోత్సవాన్ని సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట, త్రయాహ్నిక ఏక కుండాత్మక శ్రీభగవద్రామానుజ, శ్రీశఠకోప, శ్రీగోదా, శ్రీసంతాన వేణుగోపాలస్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 8.06 నిమిషాలకు శ్రీఅహోబిల జీయర్‌స్వామివారిచే మహాకుంభ సంప్రోక్షణ ప్రాణప్రతిష్టా కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ శాశ్వత ధర్మకర్తలు తుమ్మేపల్లి నరేంద్ర, కమిటీ చైర్మన్ తుమ్మేపల్లి వెంకటేశ్వరరావు, ఈవో హరిదుర్గాప్రసాద్, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రముఖుల సందర్శన..

పెద్ద రామాలయం పునః ప్రతిష్టా కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, శ్రీరాం చినబాబు తదితరులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, ప్రభుత్వాస్పత్రి కమిటీ మాజీ చైర్మన్ కఠారి హరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నర్సింహారెడ్డి, పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మన్నె అప్పారావు, వేముల విజయ్ తదితరులు పాల్గొన్నారు.



అనుగ్రహభాషణం చేస్తున్న శ్రీఅహోబిల స్వామి

విఘ్నేశ్వరునికి పుష్పార్చన



నందిగామ రూరల్: పట్టణంలోని పాత బస్టాండ్‌లో వేంచేసియున్న సిద్ధి, బుద్ధి సమిత విఘ్నేశ్వరస్వామి వారి 11వ వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారిని ఆలయ అర్చకుడు రఘుశర్మ ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి శ్వేతార్క పుష్పార్చన (తెల్ల జిల్లేడు పూలు) చేశారు. రాత్రికి పలు రకాల పుష్పాలు, విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై మంగళ వాయిద్యాలు, తీనామార్ డప్పులు, అశేష జన వాహిని నడుమ స్వామివారి ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు అన్నవరపు తిరుపతిరావు, ఆలయ కమిటీ సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు



కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని త్రినేత్ర ఆర్ట్స్ అకాడమి వార్షికోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం స్థానిక అద్దాలబజారులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అందరినీ అలరించాయి. చిన్నారులు చేసిన సంప్రదాయ నృత్యాలను తిలకించేందుకు భారీసంఖ్యలో జనం తరలివచ్చారు. అకాడమి నిర్వాహకురాలు భారతి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సరికొండకు ఎన్టీఆర్ పురస్కారం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణానికి చెందిన ప్రముఖ కవి, సాహిత్యవేత్త సరికొండ నరసింహరాజు ఎన్టీఆర్ స్మారక జాతీయ పురస్కారం అందుకున్నారు. విజయవాడ సిద్ధార్థ కళాశాలలో శనివారం రాత్రి జరిగిన ఎన్టీఆర్ శత జయంతి జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ సినీనటుడు రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా నరసింహరాజు ఈ పురస్కారం అందుకున్నారు. సరికొండ చేసిన సాహిత్య సేవలకు గాను ఆయనకు ఈ అవార్డు లభించింది. అవార్డు అందుకున్న సరికొండ నరసింహరాజుకు పట్టణ ప్రముఖులు, సాహితీవేత్తలు, అభిమానులు అభినందనలు తెలియజేశారు.

కూటమి పాలనలో అన్నివర్గాలకు అన్యాయం



మాట్లాడుతున్న ఎంపీపీ మార్కపూడి గాంధీ, పక్కన శివాజీ, జెడ్పీటీసీ నాగమణి, నాయకులు

ఎంపీపీ మార్కపూడి గాంధీ

పెనుగంచిప్రోలు: కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాలకు అన్యాయమే జరుగుతోందని వైఎస్సార్ సీపీ ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మార్కపూడి గాంధీ అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలుచేయకపోవడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 4న తలపెట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి సంబంధించి నాయకులతో సోమవారం పెనుగంచిప్రోలులో సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఎంపీపీ గాంధీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రతినెలా ఏదో ఒక పథకాన్ని ప్రజలకు అందించారని గుర్తుచేశారు. కూటమి పాలనలో సూపర్‌సిక్స్ పథకాలను గాలికి వదిలేసి రెడ్‌బుక్ పేరుతో రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. అందుకే ఈనెల 4న జగ్గయ్యపేటలో నిర్వహించే వెన్నుపోటు దినోత్సవ కార్యక్రమంలో మండలం నుంచి పెద్దసంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని కోరారు. ఆ పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ఏలూరి శివాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక, మట్టి, మద్యం, అమరావతి భూమాఫియా నడుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్య దొరకకపోయినా మద్యం మాత్రం ఎక్కడ చూసినా దొరుకుతోందని విమర్శించారు. ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా నిర్వహిస్తున్న వెన్నుపోటు దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పూట్ల నాగమణి, ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొత్తపల్లి పెంటయ్య, నియోజకవర్గ వాణిజ్య విభాగం, ఎస్సీ సెల్ అధ్యక్షులు దేరంగుల శ్రీనివాసరావు, కీసర లోకేశ్వరరావు, ఎంపీటీసీ కాకాని స్రవంతి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు చేని రాంబాబు, మండల పార్టీ ఉపాధ్యక్షులు జక్కులూరి దేవదాసు, రైతు నాయకులు చుంచు బెనర్జీ, పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రామ అధ్యక్షులు గుడిమెట్ల శంకర్, యానాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెరువు మట్టి తరలింపు

- పట్టించుకోని అధికారులు..
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



జుజ్జూరు చెరువు మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్



జుజ్జూరు గ్రామ శివారులోని రియల్ ఎస్టేట్ వెంచర్‌లో డంప్ చేసిన చెరువు మట్టి

వీరులపాడు: మండలంలోని జుజ్జూరు గ్రామ చెరువు నుంచి అక్రమార్కులు యథేచ్ఛగా మట్టిని తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. మూడు రోజులుగా రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇష్టారీతిన గ్రావెల్ తరలిస్తున్నా సంబంధిత శాఖాధికారులు మాత్రం కనీసం పట్టించుకున్న పాపానపోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆయా గ్రామాల్లోని రియల్ వెంచర్లతోపాటు పక్క మండలాలకు సైతం గ్రావెల్ తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ ట్రక్కు గ్రావెల్‌ను రూ.600ల నుంచి వెయ్యి వరకు విక్రయించి ప్రకృతి సంపదను దోచుకుంటున్నారు. అంతే కాకుండా గ్రావెల్ తోలేందుకు యంత్రాలతో భారీ గుంతలు పెడుతుండటంతో పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి కోసం చెరువులోకి దిగిన పశువులు, ఆ గుంతలో పడి మృత్యువాత పడుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని మట్టి అక్రమరవాణాను అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ రాజేష్‌ను వివరణ కోరగా చెరువులో మట్టి తోలకాలకు ఎటువంటి అనుమతులు లేవన్నారు.అనుమతులు లేకుండా మట్టి తరలించటం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్‌ను తరలించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నందిగామ రూరల్: ప్రభుత్వం అందించే ముఖ్యమంత్రి సహాయనిధి బాధిత కుటుంబాలకు భరోసానిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వం నుంచి 24మందికి మంజూరైన రూ. 14.19 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం ఆమె లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధిని బాధిత కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు వీరంకి వీరాస్వామి, కొండూరు వెంకట్రావ్ పాల్గొన్నారు.

మహిళకు తీవ్ర గాయాలు

నందిగామరూరల్: ఇసుక టిప్పర్, ద్విచక్రవాహనాన్ని (స్కూటీని) ఢీకొట్టిన ఘటనలో ఓ మహిళ తీవ్ర గాయాలపాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని తోటరావులపాడు గ్రామానికి చెందిన వేల్పుల జ్యోతి విజయవాడలోని హాస్పిటల్‌లో పనిచేస్తోంది. ఈక్రమంలో సోమవారం విధులు ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా కంచల సమీపంలోకి రాగానే ఆమె వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఇసుక టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో జ్యోతి తీవ్రంగా గాయపడటంతో, గమనించిన స్థానికులు హుటాహుటిన ఆమెను నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.